
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
గురువారం 25 జూలై 2024



జోరందుకున్న వరినాట్లు

కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఈసారి మద్దూరు మండలంలో సాగు గననీయంగా పెరిగింది. గతేడాది 21,232 ఎకరాల్లో సాగు చేయగా ఈసారి గతం కంటే 2వేల ఎకరాలపైనే సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. బుధవారం మద్దూరులో వర్షంలో స్థానిక కూలీలతో పాటు వలస వచ్చిన కూలీలు నాట్ల కోసం వరినారు సిద్ధం చేస్తుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- మద్దూరు, జూలై 24



బ్యానర్ పెట్టకపోతే ప్రజలకు ఎలా తెలుస్తుంది

- ఎంపీడీవోపై కలెక్టర్ మనుచౌదరి ఆగ్రహం
- 'ప్రజా పాలన' బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశం

సిద్దిపేటరూరల్, జూలై 24 : ప్రజాపాలన సేవా కేంద్రాలు కనపడేలా బ్యానర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డిపై కలెక్టర్ మనుచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ సిద్దిపేటరూరల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల సవరణను ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రం అని బ్యానర్ పెట్టకపోతే ప్రజలకు ఎలా తెలుస్తుందని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి వస్తున్న దరఖాస్తులను స్వీకరించి వెంటనే కన్స్యూమర్ నంబర్‌ను, విద్యుత్ యూఎస్‌సీ నంబర్లను ఆన్‌లైన్ చేసి దరఖాస్తుదారులకు లబ్ధి చేకూర్చాలని చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు



సిద్దిపేటరూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కరెంట్‌బిల్లు కట్టేద్దామా



విద్యుల్ బిల్లులు చెల్లించేందుకు బారులు తీరిన వినియోగదారులు

- అధికారిక యాప్‌లోనే విద్యుత్ బిల్లు చెల్లింపులు
- ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లకు స్వస్తి
- నూతన విధానాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- థర్డ్ పార్టీ ద్వారా వద్దంటూ సూచన
- కార్యాలయంలోనూ చెల్లించే వెసులుబాటు

సిద్దిపేట టౌన్, జూలై 24 : స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వివిధ యాప్‌లలో ఆహారం, కూరగాయలు, వస్తువులు, దుస్తులు.. ఇలా ఒక్కటేంటి అన్ని కూర్చున్న చోటు నుంచే ఆర్డర్ చేస్తున్నారు. ఇక నగదు చెల్లింపులు, డబ్బు లావాదేవీలకు కూడా పలు యాప్‌లను ఉపయోగిస్తున్నారు. నెల వారీగా బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు తదితరాల ను ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చేస్తున్నారు. పలు యాప్‌ల ద్వారా చెల్లిస్తున్న పేమెంట్లపై రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దృష్టి సారించింది. విద్యుత్ వినియోగదారులు చాలా మంది బిల్లులను థర్డ్ పార్టీ ద్వారా చెల్లిస్తుండడంతో ఫోన్ పే, గూగూల్ పే తదితర వాటి నుంచి పేమెంట్లకు బ్రేక్ వేసింది.



Electricity Bill Payments - Through App

1. Download "TGSPDCL Citizen App" from Playstore/ Appstore.
2. Register with the following:
   a. USC Number
   b. Name
   c. Mobile Number (OTP)
3. In case of multiple bills, add USC Numbers of all other services in the Menu Section
4. Go to Pay Bill (in Home Screen)
5. Verify the bill details and enter email id and proceed.
6. Select the payment gateway (anyone) from the following:
   a. T-wallet;
   b. Billdesk (preffered)
   c. Paytm
7. Select any payment - Debit Card/ Credit Card/ Net Banking/ UPI/ QR
8. Make the payment and Bill payment is successful

Electricity Bill Payments - Website (SCAN QR)

విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అధికారులు వెల్లడించిన నియమ నిబంధనలు

జిల్లాలో 5,76,076 విద్యుత్ కనెక్షన్లు

జిల్లావ్యాప్తంగా 5,76,076 విద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో గృహజ్యోతి పథకం కింద 1,83,214, రైతులు ఉచిత విద్యుత్ కింద 1,65,978 వినియోగదారులున్నారు. సిద్దిపేట జిల్లాలో 2,26,884 మంది వినియోగదారుల్లో గృహానికి సంబంధించి డొమెస్టిక్, పలు వ్యాపారాలకు సంబంధించిన కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో 60 నుంచి 70 శాతం ఇంతకాలం ఫోన్ పే, గూగుల్‌పే, పేటియం ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

థర్డ్ పార్టీ ద్వారా వద్దంటూ

విద్యుత్ బిల్లులకు సంబంధించిన చెల్లింపులు థర్డ్‌పార్టీ అయిన నగదు చెల్లించే యాప్‌ల ద్వారా తీసుకోవద్దంటూ, అందుకు స్వస్తి పలకాలని విద్యుత్ సంస్థలకు ఆర్‌బీఐ పలు సూచనలు జారీచేసింది. జూలై 1 నుంచి పలు యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవద్దంటూ వినియోగదారులకు విద్యుత్ సంస్థలు వెల్లడించాయి. వినియోగదారులు ఆందోళన చెందకుండా విద్యుత్ కార్యాలయంలో చెల్లించాలని ఆ శాఖ అధికారుల సూచిస్తున్నారు. గతంలో ఆన్‌లైన్ రాక ముందు చెల్లించిన తీరులాగే చెల్లించాలని వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్, యాప్‌లలో చెల్లించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.



అధికారిక వెబ్‌సైట్, టీజీఎస్‌పీడీసీఎల్ యాప్

అధికారిక వెబ్‌సైట్, యాప్‌లోనే..

జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు గత నెల వరకు చెల్లించిన పలు యాప్‌ల మాదిరిగానే అధికారిక వెబ్‌సైట్, యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ముందుగా టీజీఎస్‌పీడీసీఎల్ అధికారిక వెబ్ సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టీజీఎస్‌వోయూటీహెచ్‌ఈఆర్ఎన్‌పీవోడబ్ల్యూఈఆర్.‌వోఆర్‌జీ లోకి వెళ్లాలి. అందులో పే బిల్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత మీ విద్యుత్ యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేసి సబ్‌మిట్ బటన్ నొక్కాలి. అక్కడ బిల్లుకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. ఆ తర్వాత క్లిక్ హియర్ టూ పే అనే ఆప్షన్‌ను టచ్ చేయాలి. దీంతో మరో పేజీ ఓపెన్ అయ్యి బిల్లు చెల్లించేందుకు రకరకాల ఆప్షన్లు కనిపిస్తాయి. డెబిట్‌కార్డు, టీ వ్యాలెట్ ఆప్షన్లలో ఒక దానిని ఎంపిక చేసుకుని బిల్ క్లియర్ చేసుకోవచ్చు.

వెబ్‌సైట్ ద్వారానే కాకుండా టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ నుంచి కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేశాక బిల్ పేమెంట్ చేసుకోవచ్చు. దాంతో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని అధికారులు వెల్లడించారు. అలాగే విద్యుత్ కార్యాలయం, మీసేవా కేంద్రాల్లో కూడా బిల్లులను చెల్లించవచ్చు.

'కరెంట్'తో కాస్త జాగ్రత్త!

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తగా ఉండాలి
- రైతులు, మూగజీవాలకు ముప్పు
- అప్రమత్తతతోనే రక్షణ

7లో



ఫైల్

వీధి శునకాల నియంత్రణకు చర్యలు

- వారంలో 'ఏబీసీ' ప్రారంభం
- సిబ్బందితో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సమీక్ష
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట టౌన్, జూలై 24 : జిల్లావ్యాప్తంగా వీధి శునకాల స్వైర విహారంపై ఈ నెల 24న 'ఆంధ్యజ్యోతి'లో ప్రచురితమైన 'ఆరు నెలల్లో వెయ్యి' అనే కథనానికి సిద్దిపేట మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో చైర్‌పర్సన్ ముంజుల రాజనర్సు, కమిషనర్ ప్రసన్నరాణి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 315 ప్రకారం జంతు జనన నియంత్రణ, నిర్వహణ జరపాలన్న ఆదేశాల ప్రకారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సిద్దిపేటలో వీధి కుక్కల జనన నియంత్రణకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని వారం రోజుల్లో తిరిగి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలో దాదాపు 5వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లుగా గుర్తించినట్లు స్పష్టం చేశారు. 2021లో 3వేలకు పైగా కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు. మిగిలిన 2వేల కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్ త్వరలోనే నిర్వహించేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, అధికారులు ప్రేరణ పాండ, శ్రీనివాస్, యాదగిరి, సతీష్, వనిత, మాధవి, సాయికృష్ణ, కరుణాకర్ పాల్గొన్నారు.



వీధి శునకాల నియంత్రణపై సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నమున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

బెజ్జంకి, జూలై 24 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను, సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్ఠం చేసి సమూలంగా నిర్మూలించాలన్నా రు. ప్రతీ కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని చెప్పా రు. గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించే వారిపై నిఘా పెంచాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ శంకర్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎల్లయ్య, కనకయ్య, అంజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బెజ్జంకి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న సీపీ అనురాధ

ఇంటింటి జ్వర సర్వే

- మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశాలు
- రోజు 50 ఇళ్లల్లో వివరాల సేకరణ
- సర్వే ప్రారంభించిన ఆరోగ్య శాఖ

సంగారెడ్డి అర్బన్, జూలై 24: కొన్నిరోజులు కురుస్తున్న వర్షాలకు తోడు దోమల విజృంభణ, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని నిర్ణయించింది. నిత్యం 50 ఇళ్లకు వెళ్లి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సర్వే చేయనున్నారు. పదిరోజుల క్రితమే ఫీవర్ సర్వే ప్రారంభించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఆదేశించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో సర్వేను పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. తాజాగా మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జ్వర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. నిత్యం ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి జ్వరంతో బాధపడేవారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు పంపనున్నారు. అయా కేంద్రాల్లోని మెడికల్ ఆఫీసర్లు జ్వర బాధితులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తారు. అప్పటికే తగ్గకుంటే దగ్గరలోని ఏరియా, జనరల్ ఆస్పత్రులకు పంపుతారు. జ్వర సర్వేలో భాగంగా రోజూ వారి కేసుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన ప్రొఫార్మాలో జిల్లా ఆరోగ్యశాఖకు పంపాల్సి ఉంటుంది.



గుమ్మడిదల మండలం అనంతారంలో జ్వర సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కొన్నాళ్ల అతిథి

- శిథిలావస్థలో వందేళ్ల పైబడిన భవనం
- విలువైన ఫర్నిచర్, కిటికీలు చోరీ
- పర్యాటకులకు కనీస వసతులు కరువు



కోహెడ మండలం శనిగరంలో శిథిలమైన నీటిపారుదల శాఖ అతిథి గృహం

కోహెడ, జూలై 24: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతి పెద్ద చెరువుగా పేరుగాంచిన కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టు ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కరువయ్యాయి. శనిగరం గ్రామంలో ఉన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి గృహం 20 ఏళ్లుగా శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. 1913లో నైజాం నవాబుల కాలంలో ఈ అతిథి గృహాన్ని నిర్మించారు. ఇప్పటికే 111 సంవత్సరాలు దాటిపోయింది. ఏడేళ్ల క్రితం నీటి పారుదల శాఖ అధికారులు రూ.50 లక్షల అంచనాతో అతిథి గృహం భవన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు నిధులు మంజూరు చేశారు. ఈలోగా మంత్రికి శాఖ మారింది. టెండర్ పూర్తి కాకపోవడంతో అతిథిగృహ నిర్మాణ పనులు మోక్షానికి నోచుకోలేదు. చెరువులో నీరు ఉన్నా, లేకున్నా సెలవుల్లో పర్యాటకులు వస్తుంటారు. చెరువు కట్టపై చెట్లకింద కూర్చుని భోజనాలు చేస్తుంటారు. అయితే వర్షం వస్తే తలదాచుకునే పరిస్థితి కూడా లేకపోవడం గమనార్హం.



కూలిన వసతి గృహం

పట్టించుకోని పాలకులు

గత వైభవ చిహ్నాలుగా నిలిచిన నైజాం కాలం నాటి ఈ భవనం కాలక్రమేణా కనుమరుగవుతోంది. నైజాం కాలంలో అధికారులు ఈ చెరువు వద్దకు వస్తే విడిది చేసినందుకు ఈ అతిథి గృహం నిర్మించారు. స్వాతంత్ర్యం అనంతరం ఈ గృహాన్ని నీటిపారుదల శాఖకు అప్పగించారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా దీని రూపు మారడం లేదు. మండల పర్యటనలకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి ప్రజలతో సమావేశాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరడంతో పాలకులు, అధికారులు దీనివైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రహరీ లేకపోవడంతో కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. కోట్ల విలువైన స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఐబీ అధికారులపై ఉన్నది. ఇప్పటికైనా అధికారులు, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ అతిథి గృహాన్ని పునర్నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

మునురు వానకు కూలిన ఇళ్లు

దుబ్బాక, జూలై 24 : నాలుగు రోజుల నుంచి కురుస్తున్న ముసురు వర్షానికి బుధవారం దుబ్బాక మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఎడ్ల లింగవ్వ పెంకుటిల్లు కూలిపోయింది. వర్షానికి ఇల్లు కూలిపోవడంతో సుమారు రూ.80వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఆమె బోరున విలపించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వార్డు కౌన్సిలర్ ఆస సులోచనస్వామి కోరారు.



చిన్నశంకరంపేటలో పూరి గుడిసె

చిన్నశంకరంపేట, జూలై 24 : ముసురు వానకు పూరి గుడిసె కూలిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మాసాయిపేట సంగయ్య కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో వర్షానికికూలింది. గుడిసె పైకప్పు కట్టెలు కిందపడిపోవడంతో నిద్రస్తున్న వారు కేకలు వేస్తూ బయటకు వచ్చారు. సంగయ్య భార్య కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. ఉండడానికి స్థిర నివాసం లేక, తినడానికి తిండిలేకపోవడంతో బాధితులు పస్తులు ఉండే పరిస్థితి నెలకొన్నది. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఆర్ఐ గోవింద్ అక్కడకు చేరుకుని పంచనామ నిర్వహించారు. పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని గ్రామస్థులు కోరారు.

వేగంగా హెచ్ఎండీఏ చెరువుల హద్దుల గుర్తింపు

- గజం కూడా కబ్జా కాకుండా చర్యలు
- ఇప్పటికే 230 చెరువులకు నిర్ధారణ
- మరో 2,525 చెరువుల బఫర్‌జోన్
- గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్
- హైకోర్టుకు కమిషనర్ వివరణ
- రామమ్మకుంటలో ఆక్రమణలు
- నిజమేనని అంగీకరించిన ఏజీ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని అన్ని జల వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేసినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హైకోర్టుకు నివేదించారు. రామమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం) సంస్థ భవన నిర్మాణాలు చేపడుతుండటంపై హైకోర్టులో గత ఏడాది ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను ఈ నెల 22న ఆదేశించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇచ్చారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించడంతో పాటు భవిష్యత్తులో గజం భూమి కూడా కబ్జాలకు గురికాకుండా సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేశామన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3,532 జలవనరులు, చెరువులు, కుంటలు ఉన్నాయని, 230 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చామని కమిషనర్ తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరో 2,525 చెరువులకు ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ అయ్యాయని చెప్పారు. వాటిపై వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి మూడు నెలల్లో తుది నోటిఫికేషన్లు ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వని జలవనరులపై తీసుకున్న చర్యల పురోగతి నివేదికను వచ్చే వాయిదా నాటికి సమర్పిస్తామని తెలిపారు.

ఆక్రమణలు నిజమేనన్న ఏజీ

రామమ్మకుంట భూమిలో ఎన్ఐటీహెచ్ఎం సంస్థ కొంత భాగాన్ని ఆక్రమించినట్లు తేలిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అంగీకరించారు. ఈ విషయాన్ని ఏజీ ఉన్నది ఉన్నట్లు చెప్పారని ప్రశంసించిన ధర్మాసనం.. ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేసింది. వచ్చే వాయిదా నాటికి ఆక్రమణల తొలగింపుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. విచారణను నవంబరు 4కు వాయిదా వేసింది.

వ్యాక్సిన్ వికటించి మూడు నెలల పసికందు మృతి

● ప్రభుత్వాసుపత్రి వద్ద కుటుంబీకులు, గ్రామస్థుల ఆందోళన


మృతిచెందిన మూడు నెలల బాలుడు

పెద్దశంకరంపేట, జూలై 24 : వ్యాక్సిన్ వికటించడంతో మూడు నెలల పసికందు మృతిచెందగా, బుధవారం పెద్దశంకరంపేట ప్రభుత్వాసుపత్రి వద్ద తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన రాములు, మల్లేశ్వరి దంపతులకు మూడు నెలల క్రితం కుమారుడు జన్మించాడు. మల్లేశ్వరి పెద్దశంకరంపేట మండల పరిధిలోని బద్దారం గ్రామంలో ఉన్న తల్లిగారింట వద్ద ఉన్నది. బుధవారం ఉదయం మల్కాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మూడో నెల వ్యాక్సిన్ (పెంట వాలెట్)ను మూడు నెలల బాలుడికి వేయించింది. అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడు అస్వస్థతకు గురికావడంతో గమనించిన మల్లేశ్వరి, ఆమె తల్లిదండ్రులు పెద్దశంకరంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే బాలుడి పల్స్ పడిపోవడంతో మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. వ్యాక్సిన్ వికటించడంతోనే బాలుడు మృతి చెందారని, వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను సముదాయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాలుడి మృతిపై వైద్యాధికారి వేదశ్రీని స్పందిస్తూ ఈ విషయంపై పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపడుతామని తెలిపారు.

సింగూరుకు ఎగువ ప్రవాహం నిల్

● లోకల్ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచే వరద

● ఇన్ ఫ్లో 1,444 క్యూసెక్కులు

పుల్‌కల్, జూలై 24: సింగూరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ఈ నెల 20వ తేదీ నుంచి కొద్దికొద్దీగా ప్రారంభమైన వరద నీటి చేరిక బుధవారం వరకు కొంత మెరుగైంది. ఈ నెల 20న 391 క్యూసెక్కులు, 22న 1,270 క్యూసెక్కులు, 23న 1,085 క్యూసెక్కులు, బుధవారం ఉదయం నాటికి 1,444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 519.630 మీటర్లకు 13.808 టీఎంసీల నీరు ఉంది. అవుట్ ఫ్లో 391 క్యూసెక్కులుగా నమోదైంది. సింగూరు ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది తీర ప్రాంతంలో కురుస్తున్న ముసురు వర్షానికే స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నాయని ప్రాజెక్టు జేఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

త్వరలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించిన తర్వాత మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా ఖాళీలు, సీనియారిటీ జాబితాను రూపొందించే పనిలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల ఇచ్చిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నాట్ విల్లింగ్, నాన్ జాయినింగ్ ఖాళీల్లో అర్హత కలిగి ఉన్న వారి జాబితాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టి ఆ జాబితాను డీఎస్ఈకి పంపినట్టు అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్వరలో జిల్లాలో ఖాళీగా ఉన్న 66 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులు ద్వారా భర్తీ చేయనున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

మిరుదొడ్డి, జూలై 24 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన బుధవారం మిరుదొడ్డి మండలంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పర్శరాములు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్వాల చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానం వచ్చిన పోలీసులు డీసీఎంను ఆపగా పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. కర్ణాటక రాష్ట్రంలోని బల్లారీ నుంచి దౌల్తాబాద్ మండలం వడ్డెపల్లి గ్రామానికి బియ్యంను తరలిస్తున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు తెలియజేయడంతో ఘటన స్థలానికి చేరుకుని సుమారు 150 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు అంచనావేసి, గోదాంకు తరలించారు. సివిల్‌సప్లై అధికారుల నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

జోగిపేట, జూలై 24 : అందోలు పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాత్రి అంధకారం నెలకొన్నదని విద్యార్థినులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హాస్టల్ భవనంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, రాత్రంతా కొవ్వొత్తుల వెలుగులోనే చదువుకున్నామని బుధవారం విద్యార్థినులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ విషయమై ప్రిన్సిపల్ శ్రీనివాసులును వివరణ కోరగా, తమ కళాశాల భవనంతోపాటు, ఆప్రాంతలో ఉన్న మార్కండేయ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, తాము అదే సమయంలో విద్యుత్ శాఖాధికారులకు సమాచారమందించామన్నారు. అయితే, హెచ్‌టీ లైన్‌లో సమస్యతో అంతరాయం ఏర్పడిందని, బుధవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు, సరిదిద్ది, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని శ్రీనివాసులు వివరించారు.

రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులపై క్రిమినల్ కేసులు

● రేడియల్ రోడ్లపై ముమ్మర తనిఖీలు

రామచంద్రాపురం, జూలై 24 : నగరంలోని శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల, గోపన్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు ఔవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వరకు రేడియల్ రోడ్లు, ఎక్స్టెన్షన్ రోడ్ల పనులు ఏడెళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్లపై వాహనాలు అతివేగంగా ప్రయాణించడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రయత్నాలు చేపట్టారు. గత వారం తెల్లాపూర్ సాయిబాబా టెంపుల్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 9 మంది వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో ప్రయాణికులు ఒక్కసారిగా హడలెత్తి పోయారు. ఇక అతివేగంగా ప్రయాణికులను గుర్తించడానికి చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.


తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు

ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ రవీందర్

రోడ్డు ప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకుంటామని కొల్లూరు సీఐ రవీందర్ తెలిపారు. ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్లు ఇప్పటికీ పూర్తి కాకపోవడం, పూర్తయినా చోట ఉన్న విల్లాలు, అపార్టుమెంట్లలో కుటుంబాలు రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రయాణికులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని , లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వానాకాలం.. కరెంటుతో జరభద్రం

● పొంచి ఉన్న ప్రమాదాలు

● వ్యవసాయ పనుల్లో జాగ్రత్తగా ఉండాలి

● రైతులు, మూగజీవాలకు ముప్పు

● అప్రమత్తతతోనే రక్షణ



అక్కన్నపేట/ చిన్నకోడూరు, జూలై 24 : వానాకాలంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్లు, పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండడంతో బోరుబావులు, వ్యవసాయబావుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సాగుచేస్తున్నారు. ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. పశువుల పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలకు కారణాలు

● గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యన, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టూ కంచె లేకపోవడం

● గ్రామాల్లో ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వెళ్లడం

● వ్యవసాయ బావుల వద్ద పంట పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటం, విద్యుత్ తీగలకు ఊతంగా కర్రలను ఏర్పాటు చేయడం

● వర్షాకాలంలో ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటం, విద్యుత్ స్తంభాలు ఒక వైపు వంగడం, విరిగిపోవడం

● ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు మార్చడం, చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది

● వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్‌కు సరైన వైరింగ్ లేకపోవడం వల్ల ఏమరపాటుతో ఉంటే ప్రమాదాలు సంభవించటం

పాటించాల్సిన జాగ్రత్తలు

● విద్యుత్ మోటార్లు, నేలపై కాకుండా గద్దెలపై ఏర్పాటు చేసి స్టార్టర్ బోర్డులు తడవకుండా చూడాలి

● మోటార్లు పాడైతే మెకానిక్‌తో మరమ్మతులు చేయించాలే తప్ప సొంతంగా ప్రయత్నించవద్దు

● మోటార్లకు వాడే సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. ఒకవేళ వైర్లు దెబ్బ తింటే వెంటనే టేపు వేయాలి

● విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి, అదేవిధంగా స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటర్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి

● సబ్ మెర్సిబుల్ మోటార్లతో పాటు విద్యుత్ వైరు ఉంటుంది. ఏ కొంచెం వైరు తెగినా పైన ఉన్న పరికరాలకు సరఫరా జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి గమనించాలి.

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయకూడదు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర స్విచ్చాన్, ఆఫ్ చేసేటప్పుడు, మోటార్ స్టార్టర్ స్విచ్ ఆన్ ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

● విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదు

● తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లను, పరికరాలను ముట్టుకోకూడదు

● పశువులను విద్యుత్ స్తంభాలకు, సమీపంలో కట్టి వేయొద్దు

నష్టపరిహారం ఇలా..

విద్యుత్ సంస్థ మూడు రకాలుగా ప్రమాదాలకు నష్టపరిహారం అందిస్తుంది. అకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు, పశువులు మరణిస్తే పరిహారం అందిస్తారు కానీ గాయాలకు ఇవ్వరు. మనుషులు మరణిస్తే రూ.5 లక్షలు, పశువులు మరణిస్తే రూ.40 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే రూ.7 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు. ప్రమాదంలో మనిషి మరణిస్తే ఘటనా స్థలంలో తీసిన ఫొటోలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామ పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకు అయితే ఫొటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నివేదికను అందజేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వానాకాలం సీజనల్‌లో ప్రమాదాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర స్విచ్చాన్, ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధిక లోడు ఉంటే ముందే సమాచారం ఇవ్వాలి. తీగలు తెగిపడినా, కిందికి వేలాడుతున్న ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందిస్తే మరమ్మతులు చేపడతాం.

\- దుర్గ శ్రీనివాస్, ఏడీఈ ఆపరేషన్, (టీజీఎస్‌పీడీసీఎల్)హుస్నాబాద్

విద్యుత్ సమస్యలుంటే సమాచారం ఇవ్వాలి

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే, సొంతంగా మరమ్మతులు చేయకూడదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

-రమేష్, విద్యుత్‌శాఖ ఏఈ, చిన్నకోడూరు సెక్షన్

కరెంట్ వైర్లు తగిలి వ్యవసాయ కూలి మృతి


లక్మ(ఫైల్)

రామాయంపేట, జూలై 24 : పొలం పనికి వెళ్లిన కూలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి కాట్రియాల గ్రామ శివారు పన్యా తండాలో చోటుచేసుకున్నది. ఇదే మండలం బాపనయ్య మోత్కుల తండాకు చెందిన లంబాడి లక్మ(43) వ్యవసాయ కూలిగా పనిచేసుకుంటూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులాగే బుధవారం ఉదయం ఓ రైతు పొలానికి పని కోసం వెళ్లాడు. అయితే, అప్పటికే బోర్ మోటార్‌కు సరఫరా అయ్యే కరెంట్ సర్వీస్ వైర్లు పొలంలో తెగిపడ్డాయి. ఇది గమనించకుండా లక్మ పొలంలోకి దిగగా షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. కాగా ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు ఎస్ఐ రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్యాక్స్ చైర్మన్లపై అవిశ్వాసం


టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

● నేడు టేక్మాల్ సింగిల్ విండో చైర్మన్‌పై.. రేపు బీబీపేటలో

● క్యాంపులో డైరెక్టర్లు.. ఓటింగ్ సమయానికి కార్యాలయానికి

టేక్మాల్, జూలై 24 : టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) కార్యాయలంలో గురువారం అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా, అందోలు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టుపెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో టేక్మాల్ సింగిల్ విండోలో అవిశ్వాసానికి తెర తీశారు. ఇక్కడ 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక్కరు మరణించారు. మిగతా వారిలో ఎనిమిది మంది డైరెక్టర్లు సింగిల్ విండో చైర్మన్ కుచన్‌పల్లి యశ్వంత్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈనెల 3న డీసీవోకు వినతి పత్రం అందజేశారు. అవిశ్వాస తీర్మానంపై గురువారం ఉదయం 11 గంటలకు సంఘం కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 8 మంది డైరెక్టర్లు క్యాంపులో ఉన్నారు. వారు నేరుగా ఓటింగ్ సమయానికి కార్యాలయానికి వస్తారని తెలిసింది. సింగిల్ విండో కార్యాలయంలో ఓటింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అవిశ్వాసం నెగ్గుతుందా, వీగిపోతుందా ఉదయం తేలనున్నది.

బీబీపేటలో అవిశ్వాసంపై ఉత్కంఠ

కల్హేర్, జూలై 24 : మండల పరిధిలోని బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) చైర్మన్ ఎం.నరేందర్‌రెడ్డిపై ఈ నెల 26న అవిశ్వాసం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి నోటీసు జారీ చేశారు. ప్యాక్స్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఏడుగురు ఈ నెల 5న సంగారెడ్డిలోని డీసీవో కార్యాలయంలో అవిశ్వాస నోటీసు అందజేశారు. అయితే 13 మంది డైరెక్టర్లలో దేన్యా నాయక్ మరణించగా మిగతా 12 మందిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు నలుగురు మాత్రమే ఉండగా బీఆర్ఎస్‌కు 8 మంది డైరెక్టర్లు ఉన్నారు. కాంగ్రెస్ మరో ముగ్గురి సహాయంతో అవిశ్వాస నోటీసును అందజేసింది. అయితే, అవిశ్వాసం ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు తేదీ నిర్ణయం కాగానే బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు డైరెక్టర్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లు క్యాంపునకు తరలించడంతో కాంగ్రెస్ డైరెక్టర్లు ఒక్కసారిగా కుంగుతిన్నారు. కాంగ్రెస్‌కు ఉన్న నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు బీఆర్ఎస్ క్యాంపులో చేరిపోవడంతో అవిశ్వాసం నెగ్గుతుందా వీగిపోతుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది.


కర్ణాటక క్యాంపులో బీబీపేట ప్యాక్స్ డైరెక్టర్లు

దౌల్తాబాద్ ఏఎంసీ పదవులు మాకే ఇవ్వాలి

దౌల్తాబాద్, జూలై 24 : దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తమకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆది బాలకృష్ణ, దుద్దెడ స్వామి కోరుతున్నారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తాము పదవులకు అర్హులమని తమకు కేటాయించాలని వారు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని కోరుతున్నారు. దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు, టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పుడు తాము ముత్యంరెడ్డి వెంట నడిచి ఆయన గెలుపు కోసం కృషి చేశామని గుర్తుచేశారు. అనంతరం ముత్యంరెడ్డి టీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లగా, తాము కాంగ్రెస్‌లోనే కొనసాగమన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా తమను గుర్తించి పదవులను కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● లేదంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్


అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 24 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, లేదంటే బీసీ కులాలు ఏకమై వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమగ్ర కులగణన సాధన యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణన చేపడితే బీసీలు శాసించే స్థాయికి ఎదుగుతారనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేయకుండా వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. బీసీలు లేకుండా దేశంలో ఏ రాజకీయ పార్టీ ముందుకు సాగలేదని, బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని విమర్శించారు. బీసీ అంటే బ్యాక్ వార్డ్ క్లాస్ కాదని బ్రిల్లియంట్ క్లాస్ అని అభివర్ణించారు. బీసీ సమగ్ర కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు జంకుతున్నదో చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలో వచ్చిన వెంటనే సమగ్ర కుల గణన చేపడతామని జీవో జారీ చేసి రూ.150 కోట్లు నిధులు మంజూరు చేసినా ఎందుకు తాత్సారం చేస్తున్నదని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు శ్రీనరివాస్, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేష్‌చారి, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి రాజు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాహుల్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, నాయకులు రమేష్, బాలు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 24 : మెదక్ జిల్లాలో రూ.లక్ష లోపు రైతు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని, ఖాతాల్లో జమకాని రైతులు ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో వ్యవసాయ, లీడ్ బ్యాంకు మేనేజర్, కో-ఆపరేటివ్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మెదక్ జిల్లాలో 47,616 మంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీలో భాగంగా రూ.237.50 కోట్లు మాఫీ జరిగిందన్నారు. వ్యవసాయ భూమి ఉండి రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఇందులో ఎవరికైనా రుణమాఫీ జరగకపోతే మండల, జిల్లా వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లాలో మిగిలిన రైతులకు రుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరలోనే మాఫీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు గోవింద్, నరసింహమూర్తి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

● సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

ములుగు, జూలై 24 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి, రక్త నమూనాలను సేకరించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చుట్టూ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. హాస్టల్, పాఠశాల విద్యార్థులకు వేడివేడి అన్నాన్ని అందించాలని కోరారు. హాస్టళ్లల్లో విద్యార్థులకు అవసరం ఉన్న మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి అఖిల, మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా నిత్యావసరాల సరఫరా

● వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

● తప్పనిసరిగా వెయింగ్ మిషన్‌లు తనిఖీ చేయాలి : అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, జూలై 24 : జిల్లాలో పౌరసరఫరాల నిత్యావసర వస్తువుల సరఫరా పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ కార్డు, క్వాలిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని క్షేత్రస్థాయిలో సమస్యలను ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా రేషన్ షాపులో ఉన్న ప్రతీ వెయింగ్ మిషన్‌ను తనిఖీ చేసి, తేడాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీడీఎస్ నాణ్యమైన బియ్యం డెలివరీ చేయాలని, టెక్నికల్ అసిస్టెంట్లతో నిత్యం క్వాలిటీ చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శునకాలు అడవులకు

● జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో పట్టివేత


జహీరాబాద్‌లో పట్టుకున్న కుక్కలు

జహీరాబాద్, జూలై 24 : జహీరాబాద్ పట్టణంలో ఎక్కడపడితే అక్కడ కుక్కల సంఖ్య అధికమైంది. వీధుల్లో కుక్కల హల్‌చల్‌తో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ గొర్రెలు, మేకలు, లేగదూడలపైనా దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజల ఫిర్యాదుల మేరకు మున్సిపల్ అధికారులు బుధవారం నుంచి జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో సిబ్బంది చేత కుక్కలను పట్టిస్తున్నారు.

పట్టణంలో సుమారు 3000 పైచిలుకు కుక్కలు ఉంటాయని మున్సిపల్ అధికారులు అంచనావేశారు. బుధవారం కుక్కలను పట్టేవారు సుమారు 80 వరకు పట్టుకున్నారు. రోజు వారీగా పట్టణంలో పట్టిన కుక్కలను సమీపంలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని కుంచారం, తదితర అటవీ ప్రాంతంలో వదిలేందుకు నిర్ణయించారు. వాటిని అడవుల్లో వదిలాక ఆయా ప్రాంతాల్లో తిరుగుతు వన్యప్రాణులపై, పశు, పక్షాదులపై దాడులు చేయడం, సమీపంలో గల మరో గ్రామానికి వెళ్లడం సహజమే. అయితే, వాటికి ఇంజక్షన్‌లను వేస్తే సంతతి తగ్గడంతోపాటు, ఎవరిని కరిచిన ప్రమాదకరంగా ఉండదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జంతుప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు కుక్కలను అడవుల్లోకి తరలించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఎప్పటికప్పుడు అధికారులు స్పందించి వాటికి ఇంజక్షన్‌లను వేస్తే బాగుంటుదని పేర్కొంటున్నారు. అధికారులు మాత్రం వాటిలో కొన్నింటిని పట్టి అడవుల్లో వదిలేసి, మరికొన్నింటికి ఇంజక్షన్‌లు వేస్తామని వివరిస్తున్నారు.


జహీరాబాద్‌లో పట్టుకుంటున్న కుక్కలు



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతరెడ్డి

ఆసక్తి గల రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలి

● మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతరెడ్డి

హుస్నాబాద్, జూలై 24: మహిళలు తమకు సక్తి గల వ్యాపార రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమ అమలుపై మెప్మా రిసోర్స్ పర్సన్లకు జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. వివిధ బ్యాంకులు, స్త్రీనిధి నుంచి ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తున్నాయన్నారు. మహిళలు తమ సమాఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్, రాజు పాల్గొన్నారు.

వనాలు.. మానవాళికి వరాలు

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్/మద్దూరు/అక్కన్నపేట/సిద్దిపేట రూరల్, జూలై 24: వనాలు మానవాళికి వరాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కే.ప్రసన్నరాణి తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో కోమటిచెరువులోని నెక్లెస్ రోడ్డుపైన మొక్కలు లేని ఖాళీ ప్రాంతంలో గులాబీ మొక్కలను సిబ్బందితో కలిసి కమిషనర్ ప్రసన్నరాణి నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట పచ్చదనంతో విరసిల్లుతోందన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు యార్డులో తడిచెత్త ద్వారా తయారవుతున్న ఎరువును మొక్కలకు వేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, డాక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. వనమహోత్సవంలో విధించిన టార్గెట్‌ను పూర్తి చేయాలని డీఆర్డీవో జయ్‌దేవ్‌ఆర్యా పంచాయతీ సెక్రటరీల, ఐకేపీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామ్మోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వనమహోత్సవ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వన మహోత్సవంలో విధించిన 70 మొక్కల టార్గెట్‌ను గ్రామపంచాయతీలవారీగా.. మూడువేల టార్గెట్‌ను వారంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు నర్సాయపల్లి, ధర్మారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, పాల్గొన్నారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీవో జయదేవ్‌ఆర్యా అన్నారు. బుధవారం అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మొక్కలను పంపిణీ చేసి, వన మహోత్సవంలో బాగంగా మొక్కలను నాటారు. ఇందులో ఎంపీడీవో బానోతు జయరాం, ఏపీవో ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ చెట్లను పెంచాలని ఆత్మకమిటీ సిద్దిపేట జిల్లా మాజీ చైర్మన్ లక్కర్సు ప్రభాకర్‌వర్మ కోరారు. సిద్దిపేట రూరల్ మండలం రావురూకులలో విత్తన బంతులను వెదజల్లారు. మాజీ కౌన్సిలర్ మామిల్ల ఐలయ్యయాదవ్, లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ ఉన్నారు.



సిద్దిపేటలోని నెక్లెస్ రోడ్డు వద్ద మొక్కలను నాటుతున్న కమిషనర్ ప్రసన్నరాణి



సిద్దిపేట రూరల్: విత్తన బంతులను వెదజల్లుతున్న ప్రభాకర్‌వర్మ

ఆదమరిస్తే అంతే..



సిద్దిపేట కొత్త బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వచ్చేదారిలో మ్యాన్‌హోల్‌పై ఉన్న సిమెంట్ మూత పగిలిపోయి పెద్ద గుంత ఏర్పడింది. ప్రమాదం సంభవించకముందే ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సిద్దిపేట అర్బన్

కడవేరుగు క్లస్టర్ ఏఈవో లేక రైతుల ఇక్కట్లు



కడవేరుగు క్లస్టర్ రైతువేదిక

చేర్యాల, జూలై 24: చేర్యాల మండలంలోని కడవేరుగు, పోతిరెడ్డిపల్లి గ్రామాల క్లస్టర్ పరిధిలో ఏఈవో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాలకు సంబంధించి కడవేరుగు రెవెన్యూ పరిధిలోనే వ్యవసాయ భూములు ఉన్నాయి. దీంతో రైతులకు వ్యవసాయపరంగా ఎలాంటి అవసరం ఏర్పడినా కడవేరుగు ఏఈవోని ఆశ్రయిస్తున్నారు. గతంలో ఔట్ సోర్సింగ్ ఏఈవోను నియమించడంతో ఇబ్బందులు తలెత్తలేదు. కానీ రెగ్యులర్ ఏఈవో రావడంతో ఆమెను ఉపసంహరించారు. ఆమెను మరో క్లస్టర్‌కు పరిమితం చేయడంతో కడవేరుగు క్లస్టర్ రైతులకు సక్రమంగా సేవలందడం లేదు. ప్రభుత్వం తాజాగా పంట రుణమాఫీ చేపట్టడంతో పాటు రైతుబీమాకు అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు రైతులు చేర్యాల పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి పరుగెత్తాల్సిన పరిస్థితి రావడంతో తంటాలుపడుతున్నారు. కొన్నినెలల క్రితం చేపట్టిన ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా మరో ఏఈవోను నియమిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కానీ నెలలు గడుస్తున్నా జిల్లా వ్యవసాయాధికారులు మారిపోతున్నారే తప్ప ఏఈవోగా ఎవరినీ నియమించకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్న క్రమంలో రెగ్యులర్ ఏఈవోను నియమిస్తారా... లేదా, ఔట్‌సోర్సింగ్ ద్వారా మరెవరినైనా సర్దుబాటు చేస్తారా అన్న విషయమై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. మరికొద్దిరోజుల్లో రైతుబంధు అమలుకు చర్యలు తీసుకోనున్నందున ఇబ్బందులు తలెత్తకుండా ఏఈవోను నియమించాలని రైతులు కోరుతున్నారు.

'తుంగ చెరువులోకి నీటిని విడుదల చేయండి'

తొగుట, జూలై 24: తొగుట మండలం చందాపూర్ గ్రామ శివారులో ప్రవహిస్తున్న కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మత్తడి పొంగిపొర్లుతుండటంతో ఆ నీటిని ఫీడర్ ఛానల్ ద్వారా జప్తిలింగారెడ్డిపల్లి తుంగ చెరువులోకి విడుదల చేయాలని బుధవారం రాత్రి నీటిపారుదల శాఖ ఈఈ సాయిబాబను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయమై గ్రామ రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. దాంతో అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి గురువారం ఉదయం విడుదల చేస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ

గజ్వేల్, జూలై 24: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో డీఎం పవన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రమాదరహిత వారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బస్సులను బస్టాప్‌లో విధిగా రోడ్డుకు ఎడమవైపున నిలిపితే ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ప్రతిఒక్కరూ డ్యూటీ అనంతరం తగిన విధంగా విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. డీఎం పవన్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో నడుపుతున్నారని, ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు. ఏకాగ్రతతో, బాధ్యతతో బస్సులు నడపాలని డ్రైవర్లకు సూచించారు. ఈ ఏడు జీరో యాక్సిడెంట్ ఇయర్‌గా ఉండాలని, అందుకు డ్రైవర్లు సహకరించాలని కోరారు. వారివెంట అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, మెకానికల్ ఇంజనీర్ జమీల్, డ్రైవర్లు ఉన్నారు.

అక్కన్నపేట ఎస్ఐగా విజయ్‌భాస్కర్

అక్కన్నపేట, జూలై 24: అక్కన్నపేట ఎస్ఐగా ఎన్.విజయ్‌భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన తాండ్ర వివేక్ 2న కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి నుంచి ఎస్ఐ పోస్టింగ్ ఖాళీగా ఉంది. విజయ్‌భాస్కర్ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి బదిలీపై అక్కన్నపేటకు వచ్చారు.

'ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి'

మిరుదొడ్డి, జూలై 24: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని శ్రీఅనంతరెడ్డి ఎడ్యుకేషనల్ మెమోరియల్ ట్రస్ట్ అధినేత మాధవరెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ట్రస్టు ద్వారా బ్యాగులను అందజేశారు. అనంతరం స్కూల్ నుంచి బదిలీ అయిన నగేష్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, మాజీ ఉపసర్పంచ్ దిలీప్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించిన బీజేపీ నేత

హుస్నాబాద్, జూలై 24: హుస్నాబాద్ పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లేని కూరలు, అన్నం పెడుతున్నారని విద్యార్థులు చెప్పారని శంకర్‌బాబు చెప్పారు. ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, రాంప్రసాద్, కొంకటి కిషోర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడాలి

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
● ఘనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మార్కెట్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నల్లనాగుల శ్వేత

చేర్యాల, జూలై 24: రైతాంగ సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటు పడాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో మార్కెట్‌శాఖ అధికారులు చైర్మన్‌గా నల్లనాగుల శ్వేత , వైస్ చైర్మన్‌గా కామిడి జీవన్‌రెడ్డి, డైరెక్టర్లుగా పాల లక్ష్మీనారాయణ, తడక లింగమూర్తి, ఇర్రి రాంరెడ్డి, ఆసర్ల అంజయ్య, అర్జుల పోశిరెడ్డి, వంగ కృష్ణారెడ్డి, భైతి శ్రీనివాస్, ధరావత్ లక్ష్మీ, సింగపాక కుమార్, చల్లా అండాలు, బండారి కనకయ్య, భైరగోని భానుప్రకాశ్‌లచే ప్రమాణ స్వీకారం చేయించారు. రికార్డులలో సంతకాలు చేయించారు. అనంతరం యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన అభినందన సభలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. రైతాంగం సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చకుండా రైతులకు చేదోడు వాదోడుగా నిలిచి మార్కెట్‌యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు నూతన పాలకమండలి సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

● మెప్మా ఆర్పీలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ సూచన



ఆర్పీలతో సమావేశమైన కమిషనర్ నరసయ్య

గజ్వేల్, జూలై 24: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మెప్మా ఆర్పీలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఆర్పీలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం విధిగా నిర్వహించాలన్నారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో రోడ్లపై నీటి నిలువలను పరిశీలించి, తీసివేయించారు. ప్రజ్ఞాపూర్‌లోని 3వ వార్డులో గ్రేవీ యార్డును పరిశీలించారు. ఆయనవెంట మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి-కనకయ్య, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి, జూలై 24: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా అధికారులు అవగాహన కల్పించాలని సిద్దిపేట డీఎల్పీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామాన్ని అధికారులతో కలిసి సందర్శించి మాట్లాడారు. ఇటీవల డెంగీ కేసులు వరుసగా నమోదు కావడం పట్ల గ్రామంలో విస్తృతంగా పర్యటించి నిల్వ ఉన్న నీటిని తొలగించడంతో పాటు డెంగీ కేసుల గురించి ఆరాతీశారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో గణేష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఎంపీవో జహీరోద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు ఉన్నారు.



కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలతో మహిళలు



హుస్నాబాద్: ఓ స్కూల్‌లో శక్తిమాత వేషధారణల్లో విద్యార్థినులు

ఘనంగా బస్వాపూర్‌లో పోచమ్మ బోనాలు

కోహెడ, జూలై 24: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా అలంకరించిన బోనాలను ఆలయాల చుట్టూ ఊరేగించారు. కోళ్లు, గొర్రెలను అమ్మవారికి బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్, యువజన సంఘం అధ్యక్షుడు కొక్కుల రమేష్, భూమయ్య, మల్లికార్జున్, సురేష్, నరేష్, బాలరాజు, శ్రీపాల్, నవీన్ పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శక్తిమాత, పోతరాజు, వేషధారణలతో ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ప్రతీక బోనాల పండుగని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాలకు వెళ్లి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్ పాల్గొన్నారు.



మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేయని జనరేటర్

మూలనపడిన జనరేటర్

● తహసీల్ కార్యాలయంలో వివిధ సేవలకు ఇబ్బందులు

మిరుదొడ్డి, జూలై 24: తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జనరేటర్లు వినియోగంలో లేక మూలనపడి మూలుగుతున్నాయి. మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓ సంస్థ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి రక్షణ లేకపోవడంతో కొన్నేళ్లుగా వినియోగంలో లేక ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పు పడుతున్నది. ప్రస్తుతం చిన్నపాటి వర్షాలకు విద్యుత్ కోతలు అనివార్యమవుతున్నాయి. విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్లను కొట్టేందుకు విద్యుత్‌ను తీసేస్తుండడంతో ప్రభుత్వ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు నిత్యం జరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ లేక, జనరేటర్ పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గుమ్మడిదల బస్టాండ్ పరిసరాల్లో మురుగునీటితో అవస్థలు

● హోటళ్లకు గిరాకీ రావడంలేదని యాజమాన్యాల ఆందోళన

గుమ్మడిదల, జూలై 24: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో కొన్ని రోజులుగా వర్షపునీరు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణికులు ప్రజలు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు బస్‌స్టాండ్ ప్రాంతంలో నీళ్లు నిలవడంతో దోమలు, ఈగల బెడద ఎక్కువైనట్లు ప్రయాణికులు, హోటళ్ల యాజమాన్యాలవారు వాపోతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో ఉన్న హోటళ్లలో తినే పదార్థాలపై ఈగలు దోమలు వాలడంతో అంటు రోగాలు వస్తాయని ప్రజలు భయాందోళన చెందడంతో తమ గిరాకీ దెబ్బతిని నష్టపోతున్నామని హోటళ్ల యాజమాన్యాలవారు వాపోతున్నారు. బస్టాండు ప్రాంగణంలో మురికి నీరు తొలగించాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి బస్టాండ్ ప్రాంతంలో అపరిశుభ్రతను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎనిమిది మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

దౌల్తాబాద్, జూలై 24: మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 22 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇందులో 8 మంది బదిలీ అయ్యినట్లు ఎంపీవో సయ్యద్ ఘఫూర్ తెలిపారు. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో సూరంపల్లికి విద్యాసాగర్, హైమద్‌నగర్‌కు వినోద్, దీపాయంపల్లికి శ్రావణ్‌కుమార్, గొడుగుపల్లికి మల్లేశం, నర్సంపల్లికి గోపికృష్ణ, గువ్వలేగికి అనిల్, లింగరాజుపల్లికి శ్రీమాన్, శేరిపల్లి బందారంకు అజయ్ కొత్తగా వచ్చారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కార్మికుడి మృతి



మల్లమారి బాబు(ఫైల్)

నంగునూరు, జూలై 24: అప్పులబాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. నంగునూరు మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన మల్లమారి బాబు(49) తల్లిదండ్రులు ఒకే ఏడాదిలో చనిపోవడంతో సుమారు రూ.2 లక్షల అప్పు అయ్యింది. ఇంటి మరమ్మతుల కోసం ఐఐఎఫ్ఎల్ ప్రైవేట్ బ్యాంకులో రూ.5 లక్షల హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. అప్పు తీర్చే మార్గం కనపడకపోవడంతో ఈనెల 22న ముండ్రాయి గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ అసిఫ్ తెలిపారు.

రిమ్మనగూడలో వ్యక్తి అదృశ్యం

గజ్వేల్, జూలై 24: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గజ్వేల్ మండలం రిమ్మనగూడలో చోటుచేసుకుంది. గజ్వేల్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్ల రాము(40) గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పదిరోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో సైతం రవి ఇదే మాదిరిగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చిన నేపథ్యంలో.. అదేవిధంగా వస్తాడని చూడగా.. రాకపోవడంతో తల్లి నల్ల పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. రవికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో ద్విచక్ర వాహనం మాయం

గజ్వేల్, జూలై 24: గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో ద్విచక్ర వాహనం(పల్సర్) మాయమైంది. గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన నాగార్జున 23న గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో తన ద్విచక్ర వాహనాన్ని (టీఎస్ 09 జీక్యూ టీఆర్ 1646) ఉదయం పార్క్ చేశాడు. సాయంత్రం వచ్చి చూడగా ఎక్కడా కనిపించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

ములుగు, జూలై 24: ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500 అమలు చేయడంలో విఫలమైందన్నారు. అలాగే కల్యాణలక్ష్మి నిధులు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ హరిబాబు, మాజీ ఉపసర్పంచ్ సురేష్, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, తోడేటి రాజు, శేఖర్ పాల్గొన్నారు.

మీ బదిలీ మాకు బాధగా ఉంది

● పీఎన్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో నరేందర్, హెచ్ఎం సత్తయ్య

కుకునూరుపల్లి, జూలై 24: కొన్నేళ్లుగా పాఠశాల కోసం పనిచేసి బదిలీపై మీరు వెళ్లడం బాధగా ఉన్నదని పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్ తెలిపారు. కుకునూరుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన 11 మంది పాఠశాల సిబ్బంది ఏకకాలంలో బదిలీ అయ్యారు. వారికి హెచ్ఎం సత్తయ్య ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఏడుగురు ఉపాధ్యాయులు షాదుల్‌బాబా, కృష్ణవేణి, అనురాధ, రజిత, స్వామి, నరేష్, అజీజ్, నాన్ టీచింగ్ స్టాఫ్ రక్షణ, రాధాకృష్ణ, సాజిద్, రాము బదిలీ కావడం బాధగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు

చేర్యాల, జూలై 24: ప్రజలకు అందుబాటులో ఉండని చేర్యాల మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను తొలగించి, వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని సీపీఎం చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో అనేక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. ప్రజలకు సక్రమంగా సేవలందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని, కనీసం మురుగుకాలువల్లో బ్లీచింగ్ కూడా చల్లని దుస్థితి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి కమిషనర్‌ను తొలగించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బండకింది అరుణ్, పోలోజు శ్రీహరి, ఇప్పకాయల శోభ, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నిధులు సాధించలేని ఎంపీలు రాజీనామా చేయాలి

● ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి



గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/చిన్నకోడూరు/సిద్దిపేట టౌన్/నారాయణరావుపేట/అక్కన్నపేట/నంగునూరు, జూలై 24: తెలంగాణకు నిధులు సాధించలేని బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ఊసు లేకపోవడం, నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. బడే భాయ్ నరేంద్ర మోదీ.. ఛోటేభాయ్ రేవంత్‌రెడ్డిలు కలిసి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు అందని ద్రాక్షలా ఉన్నదని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ అన్నారు. గజ్వేల్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపించిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్‌లోని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి స్వగృహంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడానికే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. బుధవారం చిన్నకోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య పాల్గొన్నారు. రెండు జాతీయ పార్టీలు బడే భాయ్, చోటే భాయ్ కలిసి తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నానే అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంతప్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు రెడ్డి యాదగిరిలు వేర్వేరు నిరసన కార్యక్రమాల్లో మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మోదీ, రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలతో నిరసన చేపట్టారు. కేంద్రంలో బడే భాయ్... రాష్ట్రంలో చోటాభాయ్‌లు కలిసి బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నానేనని బీఆర్ఎస్ సిద్దిపేట సీనియర్ నాయకుడు కుంబాల ఎల్లారెడ్డి విమర్శించారు. బుధవారం నారాయణరావుపేటలో పార్టీ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్యతో కలిసి మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు అన్యాయం చేశారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. అక్కన్నపేట మండలం రామవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపారని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి, సారయ్య అన్నారు. నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.